# విధివంచితుడు

"పార్వతీశం పారిపోయాట్ట!" విశాఖపట్నం వెళ్ళిపోదామని సామాన్లు సర్దుతూవుంటే చెల్లి పరుగెత్తుకొచ్చి చెప్పింది.

ఒక్కక్షణం చెల్లి ముఖంలోకి ఆశ్చర్యంకూడిన అనుమానంతో చూశాను. నా అనుమానాన్ని గమనించి "నిజమే! అన్నయ్యా!..." అంది మాట నిర్దిష్టంచేస్తూ!

తరువాత పూర్తిగా ఆశ్చర్యానిదే వంతయింది.

పార్వతీశం ఇల్లువదలి పారిపోయినట్టు చిన్నతనంలో చాలాసార్లు విన్నాను. కాని మళ్ళి చాలా సంవత్సరాల తరువాత ఇది!

చిన్నతనంలో స్కూల్లో ఎక్కాలు అప్పచెప్పలేదని మాస్టరు కొడితే ఇంటికి వెళ్ళకుండా పారిపోయిన పార్వతీశం తెల్లవారేసరికి ప్రత్యక్షమయ్యేవాడు. ఇంట్లో అనేకసార్లు అలిగి పారిపోయిన పార్వతీశం మళ్ళి రోజు తిరక్కుండానే ఇంట్లో అడుగు పెట్టేవాడు. కాని అది యుక్తాయుక్తవిచక్షణాజ్ఞానం తెలియని బాల్యం! ఇప్పుడు ఈ వయస్సులో కూడా పారిపోయాడంటే ఆశ్చర్యపడాల్సిన విషయం! అయితే ఇప్పుడు పార్వతీశం పారిపోవటంలో ప్రత్యేకతకూడా వుంది.

"......మాస్టారి రేణుక కూడా నిన్నటినుంచి కనబడటంలేదట! ఆమెను లేవదీసుకు పోయాడని అందరూ అనుకొంటున్నారు."

అదే! అదే ప్రత్యేకత!

అదే నా ఆశ్చర్యానికి కారణంకూడా అయింది! పార్వతీశం ఎంత సాహసం చేశాడు! ఇలాటి పని చేసాడని కలలో కూడా ఊహించలేదు. అతని మనఃప్రవృత్తి నాకు చివరకూ అర్థంకాలేదు. అతని అంతర్యం నాకు సమస్యగానే మిగిలిపోయింది. పార్వతీశాన్ని గురించి చెప్పాలంటే చాలా వుంది.

◆ ◆ ◆ ◆

కొంతమంది వ్యక్తులు జన్మిస్తూ దురదృష్టాన్ని వెంటను తెస్తారు. ఆ ప్రభావం వాళ్ళ జీవితాంతం ప్రసరిస్తూనే వుంటుంది! వాళ్ళు నిందలు మొయ్యటానికే జీవిస్తున్నారా? అనిపిస్తుంది. ఆ దేవి దురదృష్టం కాగాని వాళ్ళ చర్యలుకూడా వాటికే దోహదమిస్తూ వుంటాయి.

ఇలాటి జాతకం గల వ్యక్తులలో పార్వతీశం ఒకడు. పార్వతీశం తండ్రిని చంపి పుట్టాడు. విధవతల్లి తన అన్నగారి ఇంట్లో నేవుండి ఆశైశవవరకూ పెంచింది. కాని పార్వతీశం ఆ అదృష్టాన్నికూడా పూర్తిగా పొందలేకపోయాడు. పది వాతంతో తల్లి వకాలం చేసింది. అప్పటినుండి పార్వతీశం చరిత్రలో మరోదశ ఆరంభమయింది.

మేనమామ ఇంట్లో గాలికి పెరిగినట్టు పెరిగాడు పార్వతీశం! అతని గురించి శ్రద్ధతీసుకొనే వాళ్ళెవ్వరూ లేక పోయారు. దానికితోడు పార్వతీశం అల్లరిచిల్లరి పనులు ఊళ్లోవాళ్ళకు కంటకాలయ్యాయి.

కర్తవ్యాన్ని గాలికి వదిలేసి ఫలితంకోసం వెయ్యి కళ్ళతో ఎదురుచూసే మనిషి పార్వతీశం! చదవకుండా పరీక్షలు ప్యాసుకావాలనీ, కష్టపడకుండా లక్షలార్జించాలనీ, కలలుకనేవాడు. ఆ విషయమై నేను ఎప్పుడైనా మందలిస్తే "అదృష్టం వుంటే అన్నీ కలిసొస్తాయిరా. అలా చూస్తూ వుండు! పార్వతీశం ఎంతవాడివయ్యావురా! అందువుగాని" అనేవాడు. ఇదే వాడి ధోరణి!

చిన్నతనంనుంచీ నేనూ పార్వతీశం కలిసే చదువుకున్నాం. మొత్తంమీద నుండి వాడు ప్రతిక్లాసులో రెండేసి సంవత్సరాలు కూర్చోవటంచేత వెనకబడి పోయాడు. చివరకు స్కూలుఫైనల్‌తో పోరాడలేక విసిగిపోయి చదువుకు స్వస్తి చెప్పాడు.

బాల్యంలోని సంగతులు ఇంకా కొంచెం గుర్తు! కందులవారి తోట అంటే ఒంగిన పిల్లిమామిళ్ళకి ప్రసిద్ధి! ఆ కాయలు అంతరుచిగావుండేవి. వాటికోసం పార్వతీశాన్ని ప్రయోగించేవాళ్ళం. "పార్వతీశం! ఎలాగైనా నువ్వే ఈపనిని సాధించాలోయ్! ఆ సమర్థత నీలోనేవుంది" అని అతన్ని మాటలతో ఉబ్బించి తోటకు తీసుకువెళ్ళేవాళ్ళం. అతను

చెట్టుఎక్కి కాయలుకోసి పడేస్తూవుంటే క్రింద నిలబడి ఏరు కొని జేబులు నింపుకోవటం మావంతు. ఒకసారి మాకిష్కింధ కాండ యథావిధిగా సాగిపోతూవుంటే యములాడిలా కాపలా వాడు వచ్చాడు. మా ప్రాణాలు ఎగిరిపోయినట్టయింది. అంతే! ఆలస్యంచెయ్యకుండా కాళ్ళకు పని చెప్పాం! చెట్టుమీద మిగిలిపోయి తన్నులుతిని వచ్చిన వాడు పార్వతీశం!

భోగిపండుగ దగ్గరకు వస్తోందంటే పార్వతీశానికి చేతి నిండా పనే! భోగిమంటకోసం మేమందరం కలసి సంపాదించిన కర్రలన్నీ ఒక ఎత్తు! పార్వతీశం ఒక్కడూ సాధించిన కర్రలు ఇంకో ఎత్తు! ఈ కృత్యాల్లో ఫలితం అందరంపొంది చెడు పేరునూ, పాపాన్ని అతనికి వదిలేవాళ్ళం.

ఇలాటి సంగతులు వర్ణించాలంటే చాలావున్నాయి. కానీ ఈ సాహసపు చర్యలేవీ అతను జీవితంలో స్థిరపడటానికి సాయం చెయ్యలేకపోయాయి. వాళ్ళ మామయ్య ఇతని ఉద్యోగంకోసం నానాఅగచాట్లు పడి ఒక మిల్లులో ఎకౌంట్లు వ్రాసే ఉద్యోగం వేయించాడు. కాని మూడురోజుల్లోనే దానికి స్వస్తిపలికాడు పార్వతీశం. నేను ఆ విషయమై ప్రస్తావిస్తే తనకా ఉద్యోగం అచ్చిరాలేదన్నాడు. ఇంతవరకూ వాళ్ళ ఇంట్లో తినటం, రోడ్లమీద తిరగటం, ఇలాగే సాగిపోతోంది అతని జీవితం ఇన్ని వసంతాలు అతని జీవితంలో

వెళ్ళిపోయినా ఇంకా బాధ్యత తెలియకపోవటం విచారాన్ని కలిగిస్తూ వుంటుంది.

◆ ◆ ◆ ◆

జీవితంగురించి ఏమీ పట్టించుకోకుండా గాలివాన మొక్కల్లాగా పెరిగేవ్యక్తులు ఆశ్చర్యమైనపనులు చేస్తే అవి మాకు రెట్టింపు ఆశ్చర్యాన్ని మిగులుస్తాయి వాళ్ళు ఇలాటి పని చెయ్యగలిగాడా!" అనిపిస్తుంది. అసలు పార్వతీశానికి కూడా ప్రేమించటం తెలుసునన్నమాట! రేణుకను అతడు ఇంత గాఢంగా ప్రేమించాడని నేననుకోలేదు!

* * *

రేణుక మా శంకరం మేష్టారికి ఒక్కగా నొక్క కూతురు. మాతో కలిసి ఫోరుఫారంవరకూ చదువుకొంది. తరువాత పరిస్థితుల ప్రోద్బలంతో చదువు స్వస్తిచెప్పి ఇంట్లో తల్లికి సాయంగా వుండిపోయింది. నిజం చెప్పాలంటే మాస్టారిది చాలా బీదకుటుంబం! అయినా ఆయనకు సమాజంలో వుండే విలువ అపారం! ఊళ్ళో ఉన్న పెద్దలందరూ ఒకనాడు ఆయనవద్ద విద్య నభ్యసించటమే దానికి ముఖ్యకారణం! మాష్టారి మంచితనం దానికి తోడయింది. అందుకే గ్రామస్థులకు శంకరం మేష్టారంటే అత్యంత అభిమానం, గౌరవం! వాటి సాయంతోనే అంత బీదరికంలోనూ వీధిని పడకుండా జాగ్రత్తగా కాలాన్ని గడుపుకొస్తున్నారు.

రేణుకా స్వతహాగా తెలివయినదీ కాదు. ఆమెలో మనుష్యుల్ని ఇట్టే ఆకర్షించగల అందమూ, ఆకర్షణా లేవు. నాకు తెలసినంతవరకూ ఇతఃక్రితం పార్వతీశానికీ; రేణుకకూ మాత్రం పరిచయం మాత్రం! రేణుక స్త్రీగా ఈ సాహసం చేసిందన్నా ఆశ్చర్యంగానేవుంది.

* * * *

నా ఆశ్చర్యసమూహాన్ని మనసులోనే అణగద్రొక్కి మాష్టారింటికి వెళ్ళాను. వీథిలో అరుగుమీద దీనంగా కూర్చొనివున్నారాయన. ఆయన పరిస్థితిచూస్తే చాలా బాధ అనిపించింది. ఇంతకాలం పల్లెత్తుమాటయినా పడకుండా గడపిన ఆయన ప్రశాంత జీవితవృక్షానికి ఈ సంఘటన గొడ్డలిపెట్టే అయింది. దీనికి తట్టుకోలేదన్న సంగతి ఆయనముఖంలోనే వ్యక్తమవుతోంది. పండిపోయిన చిగురుటాకులాటిది ఆయన వయస్సు. ఆయనముఖంలో ఇతఃపూర్వం చూపిన వెలుగు రేఖల్ని చూడలేకపోయాను. బాధల చీకట్ల నీడలు అవ్యక్తంగా ముసురుకొంటున్నాయి. ఆయన మంచితనానికి చిహ్నమే అన్నట్లు పండిన ముఖంలో అస్పష్టంగా ముడుతలు కన్పిస్తున్నాయి.

"ఈ పండిన వయసులో ఎంత కష్టం వచ్చింది. అనుకున్నా! నన్ను చూడగానే ఆయన కనుగొలకుల్లో అస్పష్టంగా రెండుబిందువులు మెదిలినమాట వాస్తవం. నామీద ఆయ

నకు ఉండే అవ్యాజ్యానురాగానికి చిహ్నమే అయ్యాయి అవి !

“రావోయ్! బాగున్నావా!” అంటూ ఆప్యాయతతో పలుకరిస్తూ ఇంట్లోకి దారితీశారు. కాని ఆ పలకరింపులో జీవంలేదు మిగిలింది బాధే అన్నట్లు! లోపలికి అనుసరించి చాపమీద కూర్చున్నా. నిశ్శబ్దం తాండవంచేసింది రెండు నిముషాలు! తరువాత అనిపించింది “ఎందుకు వచ్చానా!” అని. ఏం మాట్లాడాలో తెలియటంలేదు. ఏం మాట్లాడినా మాస్టారికి మిగిలేది బాధే. చివరకు తలదించుకొనే అన్నాను “రేణుకను మీరూ అనుమానిస్తున్నారా మాస్టారూ!”

నిశితంగా ఆయన నా ముఖంలోకి చూశారు. ఆయనలో ముందెప్పుడూ అలాంటి చూపుల్ని చూడలేదు. వాటిలో భావం వర్ణించలేను. లేని నవ్వు బలవంతగా పూసుకొంటూ అన్నారు “ఎంతవాడవయ్యావ్ రాజూ! నాకు ధైర్యం చెపుతున్నావా! నాకీ వయస్సులో భగవంతుడు శాంతినివ్వకుండా చేశాడోయ్, అయినా ఎదిగిన ఆడపిల్లను ఇంట్లో పెట్టుకొని కూర్చోటం నాదే తప్పు. నా అసమర్థతే కారణం, రేణుక ఎలాంటి పనిచేసిందో చూశావా? వయసు అలాంటిది. పాలపొంగులాంటిది యవ్వనం. ఆ పొరలు కప్పిన కళ్ళకు మంచి కనబడకపోవటం సహజం. కానీయ్. ఎలా జరిగితే ఎవరేం చెయ్యగలం. చిన్నతనంనుంచీ నా వద్ద చదువుకున్న పార్వతీశం ఈ పనిచేశాడంటే చాలా బాధగా

ఉంది. వాళ్ళిద్దరూ కొంచెం ముందుగా నాతో ఈ సంగతి చెప్పివుంటే......వివాహమే చేసేవాణ్ణి. కానీ అన్నీ చెయ్యి దాటి పోయాయ్."

నిశ్చలమైన గంభీరత్వమే తొణికిసలాడింది.

కొంతసేపటివరకూ ఏమీ మాట్లాడకలేకపోయాను.

"మాస్టారూ, మీరేమీ చింతించకండి. నిజానిజాలు తెలియకుండా ఎందుకనుకోవటం! రేణుక అలాటి పనిచేసిందంటే నాకు నమ్మకం కుదరటంలేదు. ఎలాగైనా రేణుకను వెదకి అప్పజెప్పేభారం నాది. మీరేమీ బెంగపెట్టుకోకండి." నాకు అంతకంటె ఏం మాట్లాడాలో తెలియదు. తెలియ లేదు.

"రాజూ!" గర్జించారాయన. ఉలిక్కిపడ్డాను.

"నువ్వేనా ఈ మాటలంటున్నది. నా తత్వం నీకు తెలియదూ! ముందు నాకు గౌరవం, మర్యాద, తరువాత ఎవరైనా! నేను మరో ప్రాణంలా కాపాడుకొనే ప్రతిష్ఠను మట్టిపాలుజేసి, సంఘంలో గుట్టుగా బ్రతికే నన్ను రచ్చకీడ్చి, ఈ ఇంటినుండి నా అనుమతిలేకుండా రేణుక ఎప్పుడు వెళ్ళిపోయిందో, ఆ క్షణంనుంచీ ఆమెకూ, ఇంటికీ సంబంధం తెగిపోయింది. హుం! నిప్పును తెచ్చి చూరులో పెట్టుకొమ్మంటావా! అది ఏ నాటికీ అది జరుగదు. ఆమెను క్షమించే శక్తి ఇక నాకు లేదు." ఆయన నేత్రాలనుండి ప్రపంచాన్ని కదిలించి వెయ్యగల శక్తితో రెండుబిందువులు రాలాయి. ఆయన

వ్యక్తిత్వానికి, గొప్పతనానికీ అవే నిదర్శనాలన్నట్లు! అణువణువునా నన్నెవరో కెలికినట్లయింది. అప్రయత్నంగా కళ్ళు చమర్చాయి! ఆయన చూడకుండా ముఖం ప్రక్కకు తిప్పుకొనే ప్రయత్నం చేశాను.

అమృతభాండంలాంటిది ఆయన మనస్సు. అలాంటిదాని మీదకు రాయివిసిరితే ఎలా వుంటుందో అర్థమవుతోంది. భగవంతుడు మనిషికిచ్చే పరీక్షలివేనా? రక్కసిలాంటి విధి తన కరాళ దంష్ట్రిలతో మనిషిని అణిచిపెట్టడానికి చేసే ప్రయత్నం ఇలాగే వుంటుందా?" కాలసర్పపు కఠినకాటుకు గురియైన మనిషికి మిగిలేది వ్యథే!" అనిపించింది.

నా కన్నీళ్ళను గమనించిన ఆయన అన్నారు. "రాజూ! కన్నీళ్ళెందుకోయ్! విధికి మనం కర్తలం కాలేము. రేణుక నా కూతురు కాదోయ్, కాని నువ్వు నాకు కొడుకువి. అలాగే ఈ అభిమానాన్ని వుండనియ్యి. జాగ్రత్తగా చదువుకో. అనవసరంగా మనసు పాడుచేసుకోకు. డాక్టరువై లోకానికి సేవచెయ్యి నాయనా! కర్తవ్యాన్ని మరిచిపోకు. వెళ్ళిపో బాబూ! మళ్ళీ ఇక్కడకు వచ్చినపుడు తప్పక కనిపించు!" ఆయన ఆ మాటలు అంటూండే నాకు తెలియకుండానే జలజల కన్నీళ్లు రాలాయి. మాష్టారు నాకు అత్యంత ప్రియులు! నా మీదకూడా ఆయన అభిమానం అలాంటిది. వంగి నమస్కరించాను. ఆయన నేత్రాలనుండి రాలిన రెండు బిందువులే ఆశీర్వచనాలయ్యాయి. భారమైన మనస్సుతో

బయటకు వచ్చేశాను. ఆ సాయంత్రమే విశాఖపట్నం చేరుకున్నాను.

* * *

ప్రదేశం మారినా పాత ఆలోచనలే వెంటబడుతున్నాయి. శంకరం మేష్టారిలో అశ్రుజలాన్ని చూడటం అదే మొదటిసారి. ఆయన శాంతికి భంగంకలిగించిన రేణుక, పార్వతీశాలమీద అభిప్రాయం మారిపోయింది.

"వీళ్ళిద్దరూ ఎక్కడికి పారిపోయుంటారు? ఏం చేస్తున్నారు? బండగా పెరిగినవాడు కనుక పార్వతీశం కష్టాలకోర్చగలడు, రేణుక ఆ పరిస్థితుల్లో జీవించగలదా! పార్వతీశం సరదా తీరినన్నాళ్ళు ఆమెను అనుభవించి ఆమెను వదిలేస్తే!! ఆమెగతి ఏం కావాలి?" అంతరాత్మ తుదిమొదలు తెలియని అనుమానాస్పద ప్రశ్నలతో నిండిపోయింది.

సుమారు పదిహేనుదినాలు దొర్లిపోయాయి.

ఒకరోజు సాయంకాలం సినిమాకు వెళ్ళామని బయలుదేరాను. "ప్రభాత్"లో పాతసినిమా ఏదో ఆడుతోంది. జనం బాగా పల్చగా వున్నారు. "బుకింగ్"వద్దకు వెళ్ళి పది రూపాయలనోటు ఇచ్చి "రిజర్వుడు" ఒకటి కావాలన్నాను.

"మీ దగ్గర చిల్లరలేదూ!" లోపలినుండి కంఠం వినిపించింది.

బాగా పరిచయమున్న కంఠం.

లోపలకు తొంగిచూశాను. టిక్కెట్లు చింపుతూ పార్వతీశం.

ఆశ్చర్యానికి అవధుల్లేవు.

జీవితంలో మనం దేనికోసం ఎక్కువ వెదుకుతూ, ఆసక్తితో ఫలితాలకై నిరీక్షిస్తూవుంటామో, అవి మనకు కొన్నిసమయాల్లో జీవితాంతం లభ్యంకానివిగా ఉండిపోతాయి! కొన్ని సంఘటనలు మాత్రం యాదృచ్ఛికంగా అనుకున్న వెంటనే నాటకంలో సీనుల్లో వెంటవెంటనే తటస్థపడుతూ వుంటాయి. అయితే అవి ఆనందంకంటె ఆశ్చర్యాన్నే ఎక్కువ మిగులుస్తాయి.

ఏ మద్రాసో, బొంబాయో దూరంగా వెళ్ళిపోయా డనుకుంటున్నా పార్వతీశం దగ్గరలోనే అనుకోనివిధంగా కన్పించాడు.

"పార్వతీశం" మెల్లిగా పిల్చాను.

బయటకు తొంగిచూచి "నువ్వట్రా! అలా లోపలికి రా!" అన్నాడు.

లోపలకు వెళ్ళి ఖాళీగావున్న కుర్చీలో కూర్చున్నా!

నన్ను చూసినతరువాత వాడిముఖ కవళికలలో కొద్దిగా మార్పువచ్చినమాట నగ్నసత్యం. అయితే నన్ను చూడగానే ముఖంలో కతివాటుకు నెత్తురుచుక్కలేకుండా, దొరికిపోయా ననే భావంతో భయపడతాడనుకున్నది మాత్రం జరగలేదు.

"మన ఊళ్ళో అందరూ బావున్నారా?" మొత్తం గ్రామానికంతకూ కలిపివేసిన మొదటిప్రశ్న అది.

"అందరూ ఎలా బాగుంటారు?" అందామనుకున్నా. కాని ఎందుకో మనసు ఆ సమాధానాన్ని అణచివేసింది. "ఏదో బాగానే వున్నారు." అని పొడిగా అన్నా.

"మా మామయ్య నిప్పులమీద ఆడుకొనేవాడిలా ఎగరటంలేదూ!" అన్నాడు చిరునవ్వుతో.

"ఎంతగెంతితే మాత్రం ఏం చెయ్యగలడు?" అన్నా.

"ఇంక ఎంతకాలం ఆ నరకంలో వుండమంటావ్ చెప్పు. ఇంత వయస్సొచ్చిందా, ఎంత చెడిన మనిషికైనా ఆత్మాభిమానం అంటూ ఏ మూలనైనా కొంత వుంటుంది. ఆరోజు రాత్రిభోజనం చేస్తూవుంటే నానామాటలు అన్నాడు. అవి సహించలేకపోయాను. ఇంట్లో పిల్లలదగ్గరనుంచి అందరూ కసురుకొనేవాళ్ళే. ఇంతకాలం సహించానుకాని, ఇక ఆ ఓపిక నాలో లేకపోయింది. అందుకే రాత్రికి రాత్రికి చెప్పకుండా వచ్చేశాను. ఇక్కడ తెలిసినాయన ఒకాయన వుంటే ఈ ఉద్యోగం సంపాదించ్చాను. ఏదో అరవై రూపాయలవరకూ అంతా కలిసి కిడుతుంది. ఎలాగో బతకలేకపోతానా! సరే! నీతో మాట్లాడుతూ కూర్చుంటే పని సాగదు. థియేటర్‌లో కూర్చో. "ఇంటర్వెల్"లో వస్తాను." లేనినవ్వు తెచ్చుకొంటూ అన్నాడు. ఎందుకో ఆ సమాధానాన్ని అంగీకరించలేకపోయాను. సంభాషణలో రేణుక ప్రసక్తి కుండా జాగ్రత్త

తీసుకొన్నట్టు తెలుస్తూనేవుంది. తను చేసినపని ఇంకా లోకానికి తెలియదనుకుంటున్నాడు కాబోలు.

"రిజర్వుడు" టిక్కెట్టు ఉంచాడు చేతిలో.

పదిరూపాయలనోటు టేబిల్ మీద పెట్టాను. ఆ నోటు తీసి నా జేబులో ఉంచుతూ "ఆమాత్రం నాకు ఋణపడుతానని భయపడుతున్నావా! పుచ్చుకుంటాన్లే!" అన్నాడు చిన్నగా నవ్వుతూ.

ఇన్నాళ్ళకు బాధ్యత తెలిసిన వ్యక్తిలా మాట్లాడు తున్నాడు పార్వతీశం.

బుకింగ్ నుంచి మెల్లిగా థియేటరు చేరుకున్నా.

సినిమా చూస్తున్నానన్న మాటేగాని మనసంతా పార్వతీశం మీదేవుంది.

ఈ విషయంలో అడుగడుగునా ఎదురయే మాటలన్నీ ఆశ్చర్యంగానే వుంటాయి.

మానవుడు సంఘ నియమాన్ని ఉల్లంఘించే విష యాల్లో కొంత సాహసం చేశాక, దాన్ని నిలబెట్టుకొనేందుకు అష్టకష్టాలుపడతాడు. ఎంత బాధ్యత తెలియనివాడైనా, అపుడు జాగ్రత్త వహిస్తాడు. పరిస్థితులే అలా చేస్తాయేమో మరి.

కాని ప్రస్తుతం పార్వతీశం చేసేది అరవైరూపాయల ఉద్యోగం! ఆ డబ్బుతో విశాఖపట్నంలాటి ధరలు మండి పోయే వూళ్ళో సంసార యాత్ర సాగించటం నదీ ప్రవాహానికి ఎదురీదటమే అవుతుంది. సుఖశాంతులుకూడా గగనకుసుమ

సదృశ లే! ఎంత బీదకుటుంబమైనా, ఒక్కగానొక్క కూతురిగా గారాబంతో పెరిగిన రేణుక బాధల్ని ఎలా భరించగలుగుతోంది!

చింపిరితలతో, రోడ్డుమీద ఇసుకంతా తలమీదపోసుకొని; కళ్ళకు పెట్టిన కాటుక ముఖమంతా పులుముకొని, త్రుళ్ళుతూ నీతో గుజ్జనగూళ్ళు ఆడిన ఎనిమిదేళ్ళ రేణుకకూ ఇప్పటి రేణుకకూ ఎంత తేడా! నా ఆలోచనకు నాకే నవ్వొచ్చింది.

పరిస్థితులు మారిపోయాయి! మనుష్యుల తత్వాలు మారిపోయాయి. కాలవేగం; బాధ్యత, అంతస్థులు, కష్టాలు, అశాంతి తెలియని స్వర్గప్రాయమైన బాల్యంనుండి జీవితమంటే ఏమిటో అర్థం చెప్పే వయసులోకి విసిరివేసింది. ఈ వయస్సులో నదీ సముద్రసంగమంలోని నౌకే అవుతుంది జీవితం. ఈ కలయిక దాటి నిశ్చల సముద్రంలో అడుగు పెట్టాక కెరటాల బాధలేకుండా జీవితనౌక సాఫీగా సాగిపోతుందేమో! ...కాని ఆ స్థితిలో తుపాను పడితే! శంకరం మాస్టారి పరిస్థితి గుర్తుకొచ్చి మనస్సు బాధతో నిండిపోయింది.

ఇంటర్వెల్ అయింది!

హాల్లో పల్చనికాంతి ఆక్రమించుకొంది.

ఆలోచనా లోకంనుండి విడిపడ్డాను.

పార్వతీశం వచ్చాడు. ప్రక్కసీట్లో కూర్చుంటూ

అన్నాడు. "నీకింకా సినిమా చూడాలని వుందా! లేక బయటకు వెళ్దామా?"

"పద వెళ్ళిపోదాం!" అన్నాను. నిజానికి నాకు సినిమా చూడాలనికూడా అనిపించటంలేదు.

బయటకువచ్చి అలంకార్ హోటల్లో కాఫీత్రాగి బీచ్ వైపు నడకసాగించాం!

నడుస్తున్నంతసేపూ నేను ఏమీ మాట్లాడలేదు.

పార్వతీశం వాడి క్రొత్త ఉద్యోగం గురించి ఏమిటేమిటో చెప్తున్నాడు.

ఉక్కిరిబిక్కిరి చేస్తున్న ఆలోచనలతో, అడగాలనుకొనే ప్రశ్నలను, అనుమానాలను మనస్సులోనే త్రొక్కేస్తూ నడుస్తున్నా!

"బీచ్" చేరుకున్నాం!

సుధాంశుడు తన చిక్కని వెన్నెల్లో లోకాన్ని ముంచుతున్నాడు. సముద్రుడు ఆ వెన్నెలను తన కౌగిట్లో నిలుపుకోవటానికి బలీయమైన కాంక్షతో ఉరకవేస్తున్నాడు. ఉవ్వెత్తున పడిలేస్తున్నా కెరటాలు వింతగా మెరుస్తున్నాయి "లైట్ హౌస్" తన కర్తవ్యాన్ని యథావిధిగా నిర్వర్తిస్తోంది.

~~వాతావరణం ఎంత ఆహ్లాదంగావున్నా~~, ఏదో తెలియని ~~వెలితి అనిపిస్తోంది~~. చేతితో నేలమీద ఇసుక నున్నగాచేస్తు కూర్చున్నా! జేబురుమాలు పరిచి ప్రక్కనే కూర్చున్నాడు

పార్వతీశం! బలంగా వచ్చిపడిన కెరటం మిగిల్చిన నురుగ కాళ్ళను తడిపి వెళ్ళిపోయింది!

అడగబోయే విషయం ఎలా ప్రారంభించాలా అని కొంతసేపు తర్కించుకొని చివరకు అన్నా "రేణుక ఏమంటోంది?" అంతకంటె సంభాషణ ఏ విధంగా ప్రారంభించాలో తెలియక చిరునవ్వు నవ్వుతూ అన్నాను.

చిన్న షాక్ తిన్నట్లు అయ్యాడు పార్వతీశం! ముఖకవళికను వర్ణించటం అసాధ్యం! అంత వెన్నెలలోనూ మాడినట్లయింది. కొంతసేపు మాట్లాడలేక పోయాడు. తేరుకొని తడబడుతూ అన్నాడు. "అయితే ఈ విషయాన్ని నీతో చెప్పిందా రే . క?" కంఠస్వరంచాలా తక్కువ స్థాయిలో వుంది! దూరాన్నుంచి అన్నట్లేవున్నాయి మాటలు.

"రే.ుక నాతో చెప్పాలా! లేకపోతే ఈ సత్యం లోకానికి తెలియదా! ఇద్దరూ కలిసి వచ్చేశారు! లోకం అంతకంటె మంచిగా ఊహిస్తుందా! ఈ సంగతి పార్వతీశం ఇంకా దాచటానికే యత్నిస్తున్నాడన్నమాట! ఇంతవరకూ నవ్వుతూ మాట్లాడిన పార్వతీశం ఇంత అధైర్యంగా ఎందుకు తయారయ్యాడు?" సందేహాలు మహా సముద్రంలో తిమింగలాలే అయ్యాయి!

"రాజూ! ఈ ఆడవాళ్ళను నమ్మినంత తెలివితక్కువ మరొకటిలేదు. నేను మొదటినుంచీ అనుమానిస్తూనేవున్నా! కాని ఇంతవరకూ వచ్చాక ఇలా మోసగిస్తుందనుకోలేదు.

కలుసుకొన్నపుడల్లా తియ్యని మాటలు చెప్పి నా మనస్సులో ఎన్నో ఊహాసౌధాలు నిర్మించి ఒక్కసారిగా వాటిని కూల దోసింది. ఆమె సాహచర్యం లో స్వర్గాన్నందుకోవాలనుకున్నా! ఫలితం నరకమే అయింది. మంచిగావుండి ప్రేమించానని తియ్యని కబుర్లుచెప్పి మోసంచేసింది. ఛీ! రేణుక మనసు పాషాణం ఇన్నాళ్ళూ తెలుసుకోలేక పోయాను. నాతోకలిసి ఎక్కడకు వచ్చెయ్యటానికైనా సిద్ధమని గాలి కబుర్లుచెప్పింది. ఆ రాత్రి ఇంట్లోంచి పారిపోయి వచ్చేసిన రాత్రి నాతో రమ్మన్నాను. పెళ్ళిచేసుకుంటానని, దూరంగాపోయి బతుకు దామని బ్రతిమిలాడాను. అందుకు సమాధానంగా ఏడుపు ప్రారంభించింది. నేనెందుకూ పనికిరానివాణ్ణనీ, అసమర్థుణ్ణనీ, పోషించలేననీ; ఏవేవో మాటలు చెప్పి ఇంట్లోకివెళ్ళి పోయింది. ఆశలన్నీ కూలిపోయాయి. కాని ఆమెమీద నాకు ప్రేమ చావలేదు. మనసు ఎంత బాధపడుతున్నా, అభిమానం అడ్డువచ్చినా లెఖ్ఖచెయ్యకుండా నా చిరునామా వ్రాసి ఇచ్చాను. ఏనాటికైనా అంగీకరిస్తే ఉత్తరం వ్రాయమని! కాని ఆ ఆశకూడా ఇకలేదు. ఇంతకూ ఆ సినీచూలవాడి మోజులో పడి అలాతయారయింది. ...అయితే ఈ సంగతి నీతోకూడ చెప్పిందన్నమాట! ... ..."నా ఆశ్చర్యానికి అవధుల్లేవు. స్తబ్ధుగా వినేవాడినే అయ్యాను"...నువ్వు నమ్మనమ్మకపో! నేను రేణుకను... ప్రేమించాను!... ప్రేమించాను! ...ప్రేమి

స్తున్నాను... ఆమె లేకుండా బ్రతికలేననిపిస్తోంది!" అతని కంఠస్వరం గద్గదికంగా వుంది.

అయితే పార్వతీశం రేణుకను తీసుకురాలేదన్న మాట.

మరి రేణుక ఏమైనట్లు?

"సినిమాలవాడు ఎవరు?" ఆశ్చర్యాన్ని కప్పిపుచ్చుకొంటూ ప్రశ్నించా.

"వాడే! కరుణాకరం! సినీమాల్లో వేషాలు వేయిస్తానని ఏవో తియ్యని మాటలు చెప్పి ఆమెను పాడుచేశాడు. లేకపోతే ఆమె నాతో వచ్చేది" రేణుక తనదికాలేదన్న బాధ ప్రతివాక్యంలోనూ వ్యక్తమవుతోంది.

నాకు పరిస్థితి అవగాహనయింది.

కరుణాకరం నేను చదువుకొనే రోజుల్లో నాకు సీనియర్. స్కూల్లో డ్రామాల్లో వేషాలువెయ్యటం, కాలరెత్తుకొని తిరగటం, ఆడపిల్లల్ని ఏడిపించటం ఇత్యాదులు వాడి హాబీలు. ప్రస్తుతం మద్రాసులో ఉంటున్నాడు. సినీమాల్లో ఎక్స్ట్రా వేషాలు వేస్తువుంటాడు. కుర్రాడు ఎర్రగా నాజూగ్గా వుంటాడు. అతని మాటలు నమ్మి అతని వలలో పడింది రేణుక.

పార్వతీశం ఇక్కడకు వచ్చేసిన రాత్రే కరుణాకరం కూడా మద్రాసు బయలుదేరి వెళ్ళాడు.

అయితే రేణుక కరుణాకరంతో వెళ్ళిపోయిందన్న మాట.

పార్వతీశానికి మిగిలింది నింద మాత్రమే! తరువాత రేఖక అనదికాలేదన్న బాధ!

ఇక అక్కసేపు పార్వతీశాన్ని "సస్పెన్సు"లో వుంచటం ఇష్టంలేక పరిస్థితి పూసగుచ్చినట్టు వివరించాను.

పార్వతీశం ముఖంలోని భావసంఘర్షణ వర్ణించటం అసాధ్యం!

నిర్జీవ ప్రతిమే అయ్యాడు.

వాడి నోటినుండి అస్పష్టంగా పెగిలిన మాటలు సముద్రపు హోరులో కలిసిపోయాయి.

ఇద్దరినీ ఆశ్చర్యంలో ముంచితేల్చిన రాత్రి గడిచిపోయింది.

* * *

పదిహేను రోజులు గడిచిపోయాయి.

ఈ మధ్యకాలంలో నేను పార్వతీశాన్ని కలుసుకోవటం జరగలేదు.

ఆరోజు-శనివారం మధ్యాహ్నం, పార్వతీశం రూముకు వెళ్ళాను. పార్వతీశం పడుకొని నిస్సహాయంగా దూలాలవైపు చూస్తున్నాడు. ముఖమంతా పీక్కుపోయివుంది. మనిషి చూడటానికి చాలా బాధగావున్నాడు.

నన్ను చూడగానే నీరసంగా లేచి తలగడక్రిందవున్న ఉత్తరంతీసి ఇచ్చి "చదువు" అన్నాడు.

మౌనంగా తీసుకొని విప్పాను!

"పార్వతీశం!—ఈ ఉత్తరం ఎలా ప్రారంభించాలో, ఎలా ముగించాలో కూడా తెలియని పరిస్థితిలో వ్రాస్తున్నా. విషయాలన్నిటికీ ముందుగా నేను కోరేదొక్కటే! నా మీద నీకున్న అభిమానం తెలుసు! అందుకే మనసారా నన్ను క్షమిస్తావనుకుంటున్నా!

మనిషి జీవితంలో కాలుజారాక తీసుకోవటమనేది చాలా కష్టమని తెలిసొచ్చింది! ముఖ్యంగా నేటి సమాజంలో స్త్రీ స్థానం అటువంటిది. నేను పతితను! హీనురాల్ని! నన్ను నమ్మించి ఇక్కడకు తీసుకొనివచ్చిన కరుణాకరం అతని కోర్కెలు తీర్చుకొని నా కంటబడకుండా పోయాడు. నా పరిస్థితి నాకిపుడు అర్థమయింది. నాకు భూమిమీద సుఖశాంతులు లభించవు! నన్ను క్షమించగలిగితే ధన్యురాల్ని.

నీకీ ఉత్తరం చేరేసరికి మరో లోకంలో వుంటా!

క్షమాభిక్ష నర్థిస్తూ,

రేణుక...

ఉత్తరం మడిచి పార్వతీశాని కందించాను.

"అయితే రేణుక చచ్చిపోయి ఉంటుందంటావా?" పిచ్చిగా నావైపు చూస్తూ అన్నాడు పార్వతీశం! ఆ చూపులు రేణుకను మనసారా క్షమించానన్న సత్యాన్ని వ్యక్తం చేస్తున్నాయి.

ఏమీ మాట్లాడలేక పోయాను.

అవ్యక్తంగా పార్వతీశం కనుకోలకుల్లోని బిందువులను మాత్రం గుర్తించగలిగాను. ఆ పరిస్థితిలో అతన్ని చూస్తే రేణుకను ఎంతగానో ప్రేమించాడనిపించింది.

♦ ♦ ♦ ♦

మర్నాడు నేను పార్వతీశం గదికి వచ్చేసరికి గదితలుపులు తెరిచేవున్నాయి. పార్వతీశం లేడు! ఇంటివారినడిగితే "అదేమో నాయనా! నిన్న సాయంత్రంనుంచి అలాగే వున్నాయి! అతను రాలేదు. ఎక్కడికి వెళ్ళాడో మరి" అన్నారు.

మళ్ళీ నాకు పార్వతీశం కన్పించలేదు।

♦ ♦ ♦ ♦

ఈ కథ జరిగి చాలా కాలమయింది.

శంకరం మాస్టారు వ్యథతో మంచంపట్టి చనిపోయారు ఈ మధ్యకాలంలో! క్రితంనెలలో మామయ్య యాత్రలకు వెళ్ళాడు. అమర్‌నాథ్ గుహలవద్ద గడ్డాలు, మీసాలు పెంచుకొని విరాగిలా తిరుగుతున్న వ్యక్తి కన్పించాడట! అతను పార్వతీశమే అంటాడు మామయ్య! మరి ఎంతవరకూ నిజమో తెలియదు.

★ ★ ★

[illegible]